దేవెగౌడకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ 91వ జన్మదినం సందర్భంగా సీఎం సిద్దరామయ్య శుభాకాంక్షలు తెలిపారు. 'మీరు మరింత కాలం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని, మీ అనుభవం మార్గదర్శకం భవిష్యత్తు తరాలకు లభించాలని కోరుతున్నట్లు' సిద్దరామయ్య శనివారం ఎక్స్ ద్వారా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. దేవెగౌడ కుమారుడు, మాజీ సీఎం కుమారస్వామి, ఆయన తనయుడు నిఖిల్‌కుమార్ , జేడీఎస్ ముఖ్య నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రాజకాలువ ఆక్రమణలపై ఉక్కు పాదం


రాజకాలువపై ఆక్రమణల తొలగింపు ఇలా..

- 8నెలల్లో 1100కు పైగా కట్టడాల తొలగింపు
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- కోర్టు స్టేలతో కొన్ని చోట్ల సమస్యలు
- దశలవారీగా కార్యాచరణ : బీబీఎంపీ కమిషనర్

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం బెంగళూరులో రాజకాలువ ఆక్రమణలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. సాధారణంగా వర్షాలు కురిస్తే రాజధానిలోని పలు ప్రాంతాలు, ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాల వాసులు ఇబ్బందులు వర్ణణాతీతం. కాస్త వర్షం పడగానే రహదారులు జలమయం కావడానికి ప్రధాన కారణం రాజకాలువ ఆక్రమణలకు గురికావడమేనని గుర్తించి ఆ దిశగా కొన్ని నెలలుగా కార్యాచరణ సాగిస్తున్నారు. 7నెలల్లో 1,134 చోట్ల రాజకాలువ ఆక్రమణలను గుర్తించి తొలగించారు. బెంగళూరు నగర వ్యాప్తంగా 860 కిలోమీటర్ల పొడవున రాజకాలువ ఉంది. ఇందులో 233 కిలోమీటర్లు ప్రాథమిక దశలోనూ, 627 కిలోమీటర్లు రెండో దశలోనూ ఉంది. ఒక మోస్తరు వర్షం కురిసినా లోతట్టు ప్రాంతాలు, రాజకాలువ చుట్టుపక్కల ప్రాంతాల వాసులు, చెరువుప్రాంతాల ఇళ్లలోకి వర్షపునీరు రావడంతో ఇబ్బందులు పడడం సామాన్యంగా ఉండేది. ప్రధాన కారణం వర్షపునీరు సజావుగా వెళ్లకుండా ఆక్రమణకు గురై పలు నిర్మాణాలు ఉండడమేనని బీబీఎంపీ అధికారులు గుర్తించారు. దీంతో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. బీబీఎంపీ గణాంకాల ప్రకారం 2వేల చోట్ల ఆక్రమణలు ఉన్నట్లుతెలుస్తోంది. 2023 సెప్టెంబరు నుంచి ఇంతవరకు 1,134 చోట్ల రాజకాలువ ఆక్రమణలను తొలగించారు. అంతకుముందు ఆక్రమణలు 829ను కలిపితే 1,963 చోట్ల ఆక్రమణలు తొలగించడంలో విజయంతమయ్యారు.

యలహంక పరిధిలోనే అత్యధికం

రాజకాలువ ఆక్రమణల్లో బీబీఎంపీ యలహంక డివిజన్‌లోనే అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. 98కిలోమీటర్ల మేర రాజకాలువ ఉండగా గత 8 నెలల్లో కొత్తగా 308 చోట్ల ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇక రెండోస్థానంలో దాసరహళ్ళి డివిజన్, మూడోస్థానంలో బొమ్మనహళ్ళి డివిజన్ ఉన్నాయి.

సమన్వయం కొరత

రాజకాలువ ఆక్రమణలు తొలగించే విషయంలో బీబీఎంపీ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1,963 కేసులకుగాను 1,639 కేసులకు సంబంధించి సర్వే జరగాల్సి ఉంది. రెవెన్యూ, బెంగళూరు నగర జిల్లా యంత్రాంగం, బీబీఎంపీ అధికారుల నడుమ సమన్వయకొరత స్పష్టంగా తెలుస్తోంది. 162 చోట్ల ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయినా తొలగించేందుకు కార్యాచరణ చేపట్టాల్సి ఉంది.

కోర్టు స్టే సమస్యలు...


కొన్ని చోట్ల ఆక్రమణలను తొలగించేందుకు కోర్టు స్టే సమస్యగా మారింది. అయితే అన్ని కేసులలోనూ ఇలా లేదని 149 కేసులలో మాత్రమే కోర్టు స్టే ఇచ్చింది. మిగిలినవాటికి అభ్యంతరం లేకున్నా అమలు చేయడంలో అధికారులు పూర్తిస్థాయిలో చొరవ చూపడం లేదని బీబీఎంపీ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

ఇంజనీర్లపై చర్యలు : కమిషనర్

రాజకాలువ తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే ఇంజనీర్లపై చర్యలు తీప్పవని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ హెచ్చరించారు. బీబీఎంపీ రాజకాలువను పర్యవేక్షించే అధికారులు తమ పరిధిలోని ఆక్రమణలు గుర్తించి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం కూడా ఆక్రమణకు గురైనట్లు గుర్తిస్తే సంబంధిత నీటి పారుదల విభాగం సహాయ ఇంజనీర్‌పై చర్యలు తీసుకునేలా హైకోర్టు సూచించిందని తుషార్ గిరినాథ్ వెల్లడించారు. బీబీఎంపీలోని 8 డివిజన్‌లలో బెంగళూరు తూర్పు, పశ్చిమ, దక్షిణ, కోరమంగల, యలహంక, మహదేవపుర, బొమ్మనహళ్ళి, రాజరాజేశ్వరినగర్, దాసరహళ్ళిలో దశలవారీగా ఆక్రమణలు తొలగించే కార్యాచరణ సాగుతోందని వివరించారు.


ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

బెట్టింగ్..టింగ్





- లోక్‌సభ ఫలితాలపై జోరందుకున్న పందేలు
- కీలకనేతలపై రూ.లక్షలకైనా సిద్ధం
- బెంగళూరు గ్రామీణ, హాసన్ స్థానాల్లో ఎంతకైనా రెడీ..

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై పందేలు జోరందుకున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు సమయం ఉండడంతో ఆయా పార్టీల అభిమానుల్లో ఉత్కంఠ పెరిగిపోయింది. తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందని లక్షలకు లక్షలు బెట్టింగ్ వేస్తున్నారు. పోలింగ్ ముగిసి రెండు వారాలు ముగుస్తున్నా అధికారికంగా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించేందుకు వీలు లేకపోవడంతో హడావుడి లేకుండా గెలుపుపై లెక్కలు వేస్తున్నారు. బీజేపీ, జేడీఎస్‌లు మైత్రిగా పోటీ చేసి ఎక్కువ స్థానాల్లో గెలుపొందాని జాతీయస్థాయిలో ప్రయత్నాలు మొదలు పెట్టారు. అధికార కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలనే అస్త్రంగా మార్చుకుని కదం తొక్కింది. ఇలా అన్ని ప్రక్రియలు ముగిశాక పార్టీలకు అంతర్గత సర్వేలు చేతికి అందిన తరుణంలో ఎవరికివారుగా బెట్టింగ్‌లకు సిద్ధమయ్యారు. ప్రధానంగా మండ్యలో కుమారస్వామి ప్రత్యర్థి స్టార్ చంద్రుల గెలుపుపై అత్యధికంగా బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాతి స్థానంలో బెంగళూరు గ్రామీణ నుంచి డీకే సురేశ్, డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ల గెలుపుతో పాటు మెజారిటీలపైనా ఇక్కడ బెట్టింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. హాసన్‌లో ప్రజ్వల్ రేవణ్ణ, శ్రేయస్ పటేల్, దక్షిణకన్నడలో కెప్టెన్ బ్రిజేశ్ చౌట, పద్మరాజ్, తుమకూరులో సోమణ్ణ వర్సెస్ ముద్దె హనుమేగౌడ, చిక్కబళ్ళాపురలో డాక్టర్ సుధాకర్ వర్సెస్ రక్షా రామయ్య, దావణగెరెలో ప్రభా వర్సెస్ గాయత్రిలపై బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తోంది.

- ఇక రెండో విడత పోలింగ్ జరిగిన ఉత్తర కర్ణాటక పరిధిలో శివమొగ్గలో గీతా శివరాజ్ వర్సెస్ బీవై రాఘవేంద్ర, బెళగావిలో జగదీశ్ శెట్టర్ వర్సెస్ మృణాల్ హెబ్బాళ్కర్, హావేరిలో మాజీ సీఎం బసవరాజ్ బొమ్మైలు గెలుస్తారనే బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ధారవాడ నుంచి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి గెలుస్తారనే బెట్టింగ్‌లు సాగుతుండగా కలబురగిలో మరింత ప్రతిష్ఠాత్మకమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పరువుకు సంబంధించిన గెలుపు కావడంతో ఇక్కడ బెట్టింగ్‌లు పెరిగాయి. బీదర్ నుంచి పోటీ చేసిన భగవంత్ ఖూబా, సాగర్ ఖండ్రెలకు మద్దతుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఫలితాలు ప్రకటించేందుకు ఇంకా 15 రోజులు ఉండడంతో ఆచితూచి పందేలు వేస్తున్నారు.



వాసవాంబకు వందనం..

ఆర్యవైశ్యుల కుల దేవత వాసవీమాత జయంతిని శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునుంచే వాసవీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హోమాలు, అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరినగర్ వాసవీ మాత ఆలయంలో మూలవిరాట్టు అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

అతనో మానసిక రోగి..!

- వంద కోట్ల ఆఫర్‌పై ఆధారాలుంటే చూపమనండి
- జేడీఎస్ నేత, అడ్వకేట్ దేవరాజెగౌడ పై మండిపడ్డ డీసీఎం డీకేశీ



బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): దేవరాజెగౌడ ఒక మానసిక రోగి అని, అతని ఆరోపణలు అవాస్తవమని డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. అతడి ఆరోపణలకు స్పందించేది లేదంటూనే పలు కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం దేవరాజెగౌడను కోర్టుకు తీసుకొచ్చినవేళ ప్రజ్వల్ రాసలీలల పెన్‌డ్రైవ్ అంశమై డీసీఎం డీకే శివకుమార్ తనకు రూ.100 కోట్ల ఆఫర్ ఇచ్చారని ఆరోపించారు. బౌరింగ్ క్లబ్‌కు రూ.5కోట్లు అడ్వాన్సు కూడా పంపారని ఆరోపించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వంద కోట్ల ఆఫర్ ఇచ్చి ఉంటే లోకాయుక్తకు ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. అతడో మెంటల్ కేసు అని ఏమైనా మాట్లాడతాడన్నారు. మీరు విద్యావంతులని, మీ మీడియాకు 100 కోట్లు ఇచ్చామంటే నమ్ముతారా అంటూ పాత్రికేయులను ప్రశ్నించారు. తాను ఎవరితోనూ మాట్లాడలేదని, తనను కలిసేందుకు వందలాదిమంది వస్తారని, ఎవరో వచ్చారో స్కాన్ చేయడం వీలవుతుందా అన్నారు. అతడు ఏం మాట్లాడినా వాటన్నింటికీ స్పందించేది లేదన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు.

బస్సు..జస్ట్ మిస్సు..!


అదుపు తప్పి వంతెనపై నిలబడిన బస్సు

డివైడర్‌ను ఢీ కొన్న బస్సు వంతెన పైకెక్కి గాలిలో నిలబడడంతో ప్రయాణికులు బెంబేలెత్తారు. శనివారం బెంగళూరు గ్రామీణ జిల్లా నెలమంగల వద్ద కేఎస్ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పినట్లయ్యింది. ఉదయం బెంగళూరు నుంచి సోమవారపేట వెళ్తున్న బస్సు డివైడర్‌ను ఢీ కొట్టి రహదారి ఎదురుగా వచ్చి నిలబడింది. అడకమారనహళ్ళి ఫ్లై ఓవర్‌పై అడ్డంగా తిరిగి ఆగిపోయింది. నాలుగు అడుగుల రోడ్డు దాటి బస్సు వెనుక చక్రాలు గాలిలో తేలాయి. ఏమాత్రం బస్సు కిందకు పడినా తీవ్ర నష్టం జరిగేది. డ్రైవర్, కండక్టర్ సహా ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపడంతో ఊపిరి పీల్చుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు

ప్రజ్వల్ బ్యాంకు ఖాతాల సీజ్‌కు

సిట్ ప్రయత్నం



బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్న సిట్ అధికారులు అతనిక ఆర్థిక వెసలుబాటు లేకుండా చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రజ్వల్‌కు డబ్బు చేరకుండా భిన్నమైన కోణాల్లో కసరత్తు చేస్తున్నారు. ప్రజ్వల్ ఆర్థిక వ్యవహారాలను కట్టడి చేసేందుకు సిట్ సిద్ధమైంది. ప్రజ్వల్‌కు సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయనున్నారు. అతడికి ఏ విధంగాను నగదు సమకూరకుండా చర్యలు చేపట్టనున్నారు. ప్రజ్వల్ రేవణ్ణ ఎక్కడ ఉన్నారనేది సిట్ గుర్తించలేకపోతోంది. బెంగళూరుకు వచ్చేందుకు ఐదు సార్లు టిక్కెట్ రిజర్వు చేసుకుని రద్దు చేసుకున్నారు. జర్మనీ నుంచి లండన్‌వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే సిట్ అధికారుల ఏ క్షణాన రాష్ట్రానికి చేరుకున్నా అదుపులోకి తీసుకునేందుకు ఎయిర్‌పోర్ట్‌ల్లో నిరంతర నిఘా పెంచారు. అయితే ఏ దేశంలో ఉన్నాడనేది అంతుబట్టకుండా ఉంది. ఇంగ్లండ్‌లో నివసిస్తున్న ప్రవాసభారతీయుడు ఓ పారిశ్రామికవేత్త సాయంతో ప్రజ్వల్ జర్మనీలోని మ్యూనిచ్ నుంచి లండన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. బ్లూకార్నర్ నోటీస్ ద్వారా ప్రజ్వల్ ఆచూకీ లభించకపోవడంతో రెడ్‌కార్నర్ నోటీస్ ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఆలయానికి వెళ్లి వస్తూ .. అనంతలోకాలకు..


- ట్రాక్టరును ఢీ కొన్న ప్రైవేట్ బస్సు
- నలుగురి దుర్మరణం
- హులిగమ్మ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

బళ్లారి గాంధీనగర్, మే 18: కొప్పళ జిల్లా హొసళ్ళి గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భక్తులు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేట్ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో నలుగురు మృత్యువాతపడ్డారు. మృతులను యలబుర్గా తాలూకా కరముడి గ్రామానికి చెందిన బసవరాజు(22), ముత్తప్ప(22), గదగ్ జిల్లా పరిధిలోని తిమ్మపుర గ్రామానికి చెందిన కొండప్ప(60), హనుమప్ప(65)గా గుర్తించారు. కరముడి గ్రామానికి చెందిన శివప్ప హొసమని అనే వ్యక్తి తన బంధవులను హులిగిమ్మ దేవస్థానానికి తీసుకెళ్ళాడు. మొక్కు చెల్లించుకుని స్వగ్రామం కరముడికి తిరిగి వెళుండగా, వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి వేగంగా వచ్చిన వచ్చిన ప్రైవేట్ బస్సు ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్లో 30 మందికి పైగా ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. ప్రమాద స్థలంలో ఇద్దరు, ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మృతిచెందారు. గాయపడ్డ మిగిలినవారిని కొప్పళ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మునిరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ యశోధా వంటగూడి బాధితులను పరామర్శించారు.


కొప్పళ జిల్లా ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హలప్ప


ప్రమాదానికి కారణమైన బస్సు


బోల్తా పడిన ట్రాక్టర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.56	1,578.61
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	41	1626
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	0	238
సామర్థ్యం (టీఎంసీలు)	3.40	3.83

వైభవంగా శంకర జయంతి



ఏనుగు అంబారీపై శంకర విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బళ్లారి సిటీ, మే 18: హొస్పేట్‌లోని చింతామణి మఠం, కోటలోని శంకరలింగ దేవాలయంలో శ్రీ శంకర భగవత్పాదుల జయంతోత్సవాలు వైభవంగా జరిగాయి. గత 12 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు చివరి రోజైన శనివారంతో ముగిశాయి. వైభవంగా శంకరలింగేశ్వరునికి ఉదయరాగ విశేష పూజలతో పాటు శంకర భగవత్పాదులకు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, రుద్రస్వాహా కార హోమం, లలితా సహస్రనామ పారాయణం, పూర్ణాహుతి, ప్రసాద వితరణ చేశారు. ప్రాచీన చారిత్రక నేపథ్యం ఉన్న చింతామణి మఠంలో కూడా శ్రీ శంకర భగవత్పాదుల జయంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అంబారీపై శ్రీ శంకర విగ్రహాన్ని ఊరేగించారు.

రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, మే 18: మానవ శరీరంలోని రక్తనాళాల్లో రక్తం ఎక్కువ పీడనంతో ప్రవహిస్తే దానిని అధిక రక్తపోటు అంటారని డాక్టర్ మరియంబి తెలిపారు. రూపనగుడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని ఇబ్రహీంపుర గ్రామంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానవులలో ఊబకాయం కారణంగా అధిక రక్తపోటు వస్తుందన్నారు. అదేవిధంగా ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం, పొగతాగడం, మద్యం సేవించడం వల్ల కూడా అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి ఒకవ్యక్తి శారీరక శ్రమ చేయాలని, బరువు తగ్గించుకోవాలని, ధూమపానం, మద్యపానం మానేయాలన్నారు. కొవ్వు, ఉప్పు తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజలందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డాక్టర్ జబీన్ తాజ్, రూపనగుడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిత్రా, వీరారెడ్డి, తారానాథ్ హాస్పిటల్ తిప్పేస్వామి, డెంటల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

సంగనకల్లు రోడ్డు విస్తరణ ప్రారంభం



సంగనకల్లు రోడ్డులో కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

బళ్ళారి గాంధీనగర్, మే 18: మహాత్మాగాంధీ వికాస యోజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సంగనకల్లు రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం అక్రమ కట్టడాలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. బసవేశ్వర నగర్, గాంధీనగర్‌ను కలిపే సంగనకల్లు రోడ్డుకు సంబంధించి చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న కట్టడాలను తొలగించాలని కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీచేశారు. అదే రోడ్డులో ఉన్న డాక్టర్ పర్వతరెడ్డి, టి.సి.గౌడలతో పాటు పలువురు కట్టడాలను తొలగించరాదని కోర్టు నుంచి స్టే తీసుకురావడంతో అక్కడ మాత్రం పనులు ఆపి మిగిలిన కట్టడాలను తొలగించారు.

తగ్గిన పూల ధరలు

హోసూరు(సిఫ్‌కాట్), మే 18: హోసూరు పూల మార్కెట్‌లో శనివారం 250 టన్నుల పూలు మాత్రమే అమ్ముడయ్యాయి. పండుగలు లేకపోవడంతో పూలధరలు బాగా తగ్గాయి. హోసూరు, డెంకణీకోట, తళి, కెలమంగలం, తదితర ప్రాంతాల్లో బంతిపూలు, గులాబీ, తదితర రకాల పూల సాగు అధికంగా ఉంది. మార్కెట్‌కు ప్రతి రోజు కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు రాకపోవడంతో ధరలు బాగా తగ్గాయి.

భక్తిశ్రద్ధలతో వాసవీ జయంతి



రాయచూరులో అమ్మవారికి తులాభారం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



బళ్లారి సిటీ, రాయచూరు, మే 18: బళ్లారి నగరంలోని శ్రీ వాసవి విద్యాలయ ఆవరణలో శ్రీ వాసవి మాత జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. జ్యోతి వెలిగించి, ప్రార్థనా గీతం ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ పోలా బసవరాజ, కార్యదర్శి సురేశ్, సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరేశ్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి తులాభారం

వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఆర్యవైశ్యుల కులదైవం వాసవి శ్రీ కన్యకాపరమేశ్వరి జయంతిని శనివారం రాయచూరు నగరంలోని నగరేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధమైన తులాభారం నిర్వహించి మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం పల్లకిసేవా, వెండి రథంపై అమ్మవారి ఊరేగింపును కన్నుల పండుగగా నిర్వహించారు.



బళ్లారిలో వాసవి జయంతి కార్యక్రమంలో వాసవి ట్రస్టు సభ్యులు

రాయచూరులో భారీ ఇసుక డంప్ స్వాధీనం

- 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసిన అధికారులు
- చిక్కరాయనకుంపి గ్రామ పొలం యజమానిపై ఎఫ్ఐఆర్ దాఖలు



అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్

రాయచూరు, మే 18 : జిల్లాలోని దేవదుర్గం తాలూకా చిక్కరాయనకుంపి గ్రామ శివారులో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న ఇసుక డంప్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణనది తీర గ్రామాల్లో ఇటీవల పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న మైనింగ్ శాక అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు బృందంగా ఏర్పడి శనివారం ఆకస్మికంగా దాడి జరిపి ఇసుక నిల్వలను తమ అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి పొలం యజమాని హనుమంతరాయ పై కేసు నమోదు చేశారు. కాగా ఈ ఇసుక దాదాపు 20 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. హనుమంతరాయ అనే నిందితుడి పై ఇది రెండవ కేసుగా అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా నిల్వ చేసిన నేపథ్యంలో గతంలోను ఆయన పై కేసులు నమోదు అయినట్లు అధికారులు వివరించారు. కాగా ఇంతకుపూర్వం పెద్ద ఎత్తున పట్టుబడిన అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమైయ్యారంటు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడిన మరో సామానిక కార్యకర్త నాగరాజ్ పాటీల్, గతంలో ఇదే స్థళంలో వేల టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచిన స్వాధీనం చేసుకున్న అధికారులు దాన్ని ఇక్కడి నుంచి తరలించడంలో విఫలమైయ్యారన్నారు. అధికారులు సీజ్ చేసి వెళ్లిన 24 గంటల్లోనే ఉన్న ఇసుకనంతా దోచేశారని ఇందులో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. కేసు నమోదు చేయడం వరకే పరిమితం కాకుండా స్వాధీనం చేసుకున్న ఇసుకను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం అధికారులకు సవాలు వంటిదేనని ఆయన వ్యాఖ్యానించారు. కాగా అధికారులు తాము స్వాధీనం చేసుకున్న ఇసుకను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లామని దీంతో పాటు జిల్లా ఇసుక నిర్వహణ సమితికి ఇసుక నిల్వలను అప్పగిస్తామన్నారు. న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలకనుగుణంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి గబ్బూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

వైభవంగా దొడ్డ ఆంజనేయస్వామి రథోత్సవం



దొడ్డ ఆంజనేయస్వామి వారి రథోత్సవ దృశ్యం

కంప్లి, మే 18 : కుడితిని పట్టణంలో ప్రసిద్ధి గాంచిన సీతారామలక్ష్మణ సమేత దొడ్డ ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో సీతారామ లక్ష్మణులకు, వినాయకునికి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తాదులకు ఆలుమత సమాజం నుండి మజ్జిగ పంపిణీ చేపట్టారు. గ్రామంలో మహిళలకు ఒడి నింపే కార్యక్రమం కూడా నిర్వహించారు. జలాభిషేకం, పంచామృతాభిషేకం, స్వామివారికి వివిధ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని ఊరేగించారు. రథోత్సవానికి కుడితినితో పాటు చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలు హోస్పేట, సండూరు, బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, గంగావతి, పట్టణాల నుంచి కూడా భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా కుడితిని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో రథానికి భక్తాదులు పెద్ద పెద్ద పూలదండలతో మొక్కులు సమర్పించుకున్నారు.

రూ.41 కోట్ల కరువు సహాయ నిధుల విడుదల

- 36,944 మంది రైతుల ఖాతాలకు సొమ్ము జమ
- కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా వెల్లడి

బళ్లారి సిటీ, మే 18: జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో డీబీటీ ద్వారా రెండు దశల్లో జిల్లాలోని 36,944 మంది రైతుల ఖాతాలకు రూ.41.40కోట్లు జమ చేసినట్లు జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. 2023-24 ఖరీఫ్‌లో జిల్లాలోని మొత్తం ఐదు తాలూకాలను కరువు పీడిత తాలూకాలుగా ప్రభుత్వం ప్రకటించింది. సీజన్‌లో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పంటల సర్వే డేటా ఆధారంగా రైతులకు డీబీటీ ద్వారా ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం 9 విడతల్లో గరిష్టంగా ఒక్కొక్కరికి రూ.2000 వరకు పంపిణీ చేశామన్నారు. మొదటి విడతలో 36,944మంది రైతులకు పంట నష్టం పరిహారం ఇప్పటికే పంపిణీ చేశామన్నారు.

రెండోదశలో జిల్లాకు చెందిన 31,351 మంది అర్హులైన రైతులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం రూ.34.03 కోట్ల పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)పంపిణీకి ఆమోదం వచ్చిందని, దీనిని కూడా డీబీటీ ద్వారా రైతు ఖాతాలో త్వరలో జమ చేస్తామన్నారు. పంట నష్టపరిహారం ఖాతాలో జమ చేయకపోవడంపై ఫిర్యాదులు చేయడానికి వీలుగా జిల్లా, తాలూకా వారీగా హెల్ప్‌లైన్ ఏర్పాటుచేశామని, ఆ నెంబర్లను సంప్రదించడం ద్వారా పరిహారం పొందవచ్చన్నారు.

పంట నష్ట పరిహారం పొందడానికి పహాణీని ఫ్రూట్స్ ఐడీకి లింక్ చేయడం తప్పనిసరని, ఇప్పటివరకు ఫ్రూట్స్ ఐడీని నమోదు చేసుకోని రైతులు తమ ఆధార్, పహాణీ, బ్యాంక్ పాస్‌బుక్ పత్రాలను తీసుకొని సమీపంలోని రెవిన్యూ వ్యవసాయ లేదా ఉద్యానవన శాఖ కార్యాలయాలను సందర్శించి నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే ఆటువంటి రైతులు పంట నష్టపరిహారం పొందేందుకు అర్హులు కాదని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



జుబేరాకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి

బళ్లారిరూరల్, మే 18 : మహిళలకు రక్షణ కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సు పాస్‌లు, ఇతర సంక్షేమాలు అందిస్తున్నప్పటికీ మహిళలకు రక్షణ కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వుందన్నారు. హుబ్లిలో అంజలి, నేహా హత్యలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించకపోవడం కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దౌర్జన్యాలను అరికట్టాలని కేంద్ర హోంమంత్రి, రాష్ట్ర హోం మంత్రులకు రాసిన వినతిపత్రాలను బళ్లారి అసిస్టెంట్ కలెక్టర్ జుబేరాకు సమర్పించారు. ఇకపై మహిళలపై అత్యాచారాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన హిరేమఠ్, జ్యోతి ప్రకాష్ మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి, నగర అధ్యక్షురాలు రాజేశ్వరి, గౌసియా, చాందిని, సీతారామ్, రూప, పుష్ప, పరిమళ, పవిత్ర, తనుశ్రీ, గీత, పలువురు మహిళలు పాల్గొన్నారు.

బసవేశ్వర సర్కిల్ విస్తరణ పనుల ప్రారంభం



బళ్లారిరూరల్, మే 18 : బళ్లారి 21వవార్డు సమీపంలోని బసవేశ్వర సర్కిల్ అభివృద్ధి పనులను మంగళవారం ఉదయం సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి ప్రారంభించారు. సంగనకల్లు రోడ్డు కేఈబీ సర్కిల్ నుంచి శబరి దర్శన్ హోటల్ వరకు అభివృద్ధి పనులు ఇప్పటికే ఆలస్యమైనందున మంగళవారం జేసీబీ సహాయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కొద్ది రోజుల క్రితమే నిధులు విడుదల అయినప్పటికీ పనులు ఆలస్యం కావడంతో బసవేశ్వర సర్కిల్‌ను సుందరంగా నిర్మించాలని విస్తరణ పనులను శనివారం ప్రారంభించారు.

మోటారు బైక్-ఆటో ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

రాయచూరు, మే 18 : ఎదురెదురుగా వస్తున్న ఆటో-ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. రాయచూరు నుంచి దేవసుగూరుకు శనివారం బైక్‌పై వెళుతున్న వ్యక్తిని రాయచూరు తాలూకాలోని హెగ్గసనహళ్ళి సమీపంలోని పవర్ బేస్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారుడికి కాలు విరిగిపోగా ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరుగుప్ప, మే 18 : ఉద్యోగస్తుల పిల్లలు ప్రతిభాపురస్కారాలకు దరఖాస్తులు సమర్పించుకోవచ్చని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లింగరాజరెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ, పీయుసీలో 90 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగస్తుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్జీవో సంఘ సభ్యులకే ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నిమిషాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో నిమిషాంబిక దేవి

కంప్లి, మే 18 : కంప్లి పట్టణంలో నిమిషాంబిక దేవి జయంతోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి ఆకు పూజలు, పుష్పాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్రనామాలతో వివిధ పూజలు చేపట్టారు. నిమిషాంబిక ఆలయంలో మహిళలు పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతియేటా ఈ జయంతోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటామని సమాజ ప్రముఖులు తెలిపారు.

హోసూరు జోన్

విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహనా శిబిరం



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కలెక్టర్), మే 18: కృష్ణగిరి జిల్లాలో 12వతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యకు సంబంధించి శనివారం ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తమిళనాడు ప్రభుత్వం ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నదో వివరించారు. కలెక్టర్ సరయు నేతృత్వంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించగా పెద్దసంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఉన్నత విద్యకు వెళ్లడానికి అనేక స్కాలర్‌షిప్ అవకాశాలు, ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఉత్తమ అవకాశాల కోసం ఏ కళాశాలలో చదవాలి, భవిష్యత్తును సుసంపన్నం చేసుకోవడానికి ఏ కోర్సును ఎంచుకోవాలి అనే విషయాలను ప్రస్తావించారు. అదేవిధంగా ఇంజనీరింగ్, మెడిసిన్, ఐటీఐ వంటి కోర్సులకు భిన్నంగా పాలిటెక్నిక్ వంటి కోర్సు చదివినా మంచి ఉద్యోగావకాశాన్ని పొందవచ్చునని తెలిపారు. మంచి నైపుణ్యం ఉన్న వారికి వెంటనే ఫ్యాక్టరీలలో ఉపాధి లభిస్తోందన్నారు. అలాగే కళాశాలలోని లైబ్రరీని ఉపయోగించుకుని జ్ఞానార్జన పెంచుకోవాలన్నారు. అలాగే వార్తాపత్రికలు చదవాలని తద్వారా మన చుట్టూ ఏం జరుగుతోందో తెలుసుకోవచ్చునన్నారు.

నాసిరకం రోడ్లపై ప్రజల ఆక్రోశం

హోసూరు, మే 18: హోసూరు కార్పొరేషన్ వివిధ ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తున్న లింక్ రోడ్లపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 41వ వార్డు పరిధిలో నిర్మించిన రోడ్డును మున్సిపల్ కార్పొరేషన్ అన్నాడీఎంకే కౌన్సిలర్ కుబేరన్, శంకర్ స్వయంగా సందర్శించి అభ్యంతరం తెలిపారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో కంకర తేలిందన్నారు. కొన్నిచోట్ల ఉద్దేశపూర్వకంగానే రోడ్లపై గుంతలు అలాగే ఉంచారన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు వాహనాలు బయటకు తీయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు స్వయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సెల్వ కాళియమ్మకు విశేషపూజలు

హోసూరు, మే 18: హోసూరు సమీపంలోని సెల్వ కాళియమ్మ ఆలయంలో వైశాఖమాసం కావడంతో ప్రత్యేక అభిషేకాలు పూజలు ఘనంగా నిర్వహించారు. హోసూరు సమీపంలోని ఉద్దన్నపల్లి కొత్తూరురోడ్డులో శీ సెల్వ కాళియమ్మ ఆలయంలో అంజనేయస్వామికూడా ఉన్నారు. వైశాఖ మాసం కావడంతో హనుమంతునితో పాటు అమ్మవారు, శివుడు, వెంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణి, వినాయకుడు, జడామునేశ్వర, నందీశ్వరుడు, గరుడాళ్వార్ వంటి దేవతలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేడుకల ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త న్యాయవాది విజయకుమార్ పర్యవేక్షించారు.



వేసవిలో విద్యార్థులకు డ్యాన్స్‌లో శిక్షణ



విద్యాభారతి పాఠశాలలో రింగ్ డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంప్లి, మే 18 : కంప్లి తాలుకా సుగ్గినహళ్లి గ్రామంలోని విద్యాభారతి పాఠశాలలో వేసవి శిబిరాల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు రింగ్ డ్యాన్స్ నృత్యం, తదితర క్రీడల్లో విద్యార్థులకు విద్యాభారతి పాఠశాల యాజమాన్యం శిక్షణ ఇస్తోంది. ఈ సందర్భంగా విద్యాభారతి పాఠశాల అధ్యక్షురాలు ఉమాదేవి మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ఉచితంగా విద్యార్థులకు వేసవి శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. క్రీడల్లో నిపుణుడైన బళ్లారికి చెందిన బసవరాజయ్య గత 11 సంవత్సరాలుగా శిక్షణలో పేరుగాంచారని, విద్యార్థులు కూడా చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు వారికి ఆయన ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు ముందుండాలని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేంచేందుకు ఆసక్తి చూపిస్తూ ముందుకొచ్చారని తెలిపారు.

అంజలి హంతకుడిని కఠినంగా శిక్షించాలి

కంప్లి, మే 18 : హుబ్లీలో రెండు రోజుల క్రితం అంజలి అంబిగర అనే యువతిని హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ గంగామత సమాజం ఆధ్వర్యంలో కంప్లి పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్ శివపురకు వినతిపత్రం అందించారు. అనంతరం గంగమత సమాజం రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నూరు నాగరాజు మాట్లాడుతూ అంజలిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించి యువతి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఇన్ని జరుగుతున్నా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం ముందుకొచ్చి యువతి కుటుంబానికి రూ. 50 లక్షలు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కారేకల్ మనోహర్, కంప్లి తాలుకా అధ్యక్షులు నాగరాజు, సిద్దప్ప, అయోధ్య వెంకటేష్, తాయన్న, రమేష్, మెట్రి గిరీష్, సురేష్, నాగరాజు, కారేకల్ ప్రకాష్, తిమ్మప్ప, లోకేష్, సమాజం పదాధికారులు, యువకులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

అరియకుడి రామానుజ అయ్యంగార్ (జయంతి)



అరియకుడి రామానుజ అయ్యంగార్ 1890 మే 19న జన్మించారు. కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసులు. పాడడంలో సరికొత్త శైలిని అభివృద్ధి చేశాడు. అరియకుడి సంప్రదాయంగా ఆయన శిష్యులు అనుసరిస్తున్నారు. కర్ణాటక సంగీత కచేరీలలో కొత్తపద్ధతులను స్థిరపరిచారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించింది. 1958లో 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు. 1967 జనవరి 23న కన్నుమూశారు.

గుడిపాటి వెంకటాచలం (జయంతి)



'చలం'గా పేరొందిన గుడిపాటి వెంకటచలం 1894 మే 19న మద్రాసు నగరంలో జన్మించారు. సుప్రసిద్ధ తెలుగు రచయిత, వేదాంతి, సంఘసంస్కర్త, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అతిముఖ్యమైన వ్యక్తులలో చలం ఒకరు. ఆయన రచనలు చాలావరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని ఉంటాయి. సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలను చర్చించాడు. 1979 మే 4న కన్నుమూశారు.

నీలం సంజీవరెడ్డి (జయంతి)



నీలం సంజీవరెడ్డి 1913 మే 19న అనంతపురం జిల్లా ఇల్లూరు గ్రామంలో జన్మించారు. భారత 6వ రాష్ట్రపతిగా 1977-82 మధ్య వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్రరాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి ప్రజల మన్ననలు పొందిన రాజకీయవేత్త. లోక్‌సభ సభాపతిగా ఎన్నిక కాగానే తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి మంచి వాతావరణం నెలకొల్పి స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం. 1996 జూన్ 1న బెంగళూరులో కన్నుమూశారు.

పి లీల (జయంతి)




'పద్మభూషణ్' గ్రహీత పొరయత్తు లీల 1934 మే 19న జన్మించారు. దక్షిణభారత నేపథ్య గాయని, మలయాళ చిత్ర రంగంలో ప్రప్రథమ నేపథ్య గాయని. తమిళ, మలయాళ, తెలుగు భాషల్లో 15వేలకుపైగా పాటలు పాడారు. లవకుశ, మాయాబజారు, పాతాళభైరవి, పాండవ వనవాసం, గుండమ్మకథ, మిస్సమ్మ తదితర సినిమాల్లో ఆమె పాడిన పాటలు ఎంతో ప్రజాదరణ పొందాయి. కలైమామణి, గానకోకిల, గానమణి తదితర పురస్కారాలు పొందారు. 2005 అక్టోబరు 31న కన్నుమూశారు.

గిరీశ్ కర్నాడ్ (జయంతి)



గిరీశ్ రఘునాథ కర్నాడ్ 1938 మే 19న మహారాష్ట్రలోని మథేరా లో జన్మించారు. రచయిత, సినిమా దర్శకుడు, నటుడు, కవి. కన్నడ సాహిత్యానికి వన్నె తెచ్చిన నాటక, సాహితీవేత్త. కర్ణాటకలో ఏడవ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత. సమకాలీన సాహితీవేత్తలు, పెద్ద వారిపట్ల అభిమానం చూపేవారు. ఇద్దరు కన్నడ కవుల కావ్యాలను చలనచిత్రాలుగా వెండితెరకెక్కించిన ఘనత ఆయన సొంతం. తెలుగులో ధర్మచక్రం, శంకర్ దాదా ఎంబీబీఎస్, ప్రేమికుడు తదితర సినిమాలలో నటించారు. 2019 జూన్ 10న కన్నుమూశారు.

జంషెడ్‌జీ టాటా (వర్ధంతి)



జంషెడ్‌జీ టాటా 1839 మార్చి 3న గుజరాత్‌లోని నవశ్రీలో జన్మించారు. భారత పారిశ్రామిక పితామహగా పేరొందారు. పారిశ్రామికవేత్తగా టాటా గ్రూప్ ను ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద సంస్థగా విస్తరింపచేశారు. పారిశ్రామికరగంలో ఎంత ప్రభావితం చేశారంటే టాటాను 'వన్‌మ్యాన్ ప్లానింగ్ కమిషన్'గా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించారు. టాటా ఐరన్, స్టీల్‌వర్క్‌తోపాటు ఆధునిక భారతీయ వ్యాపారానికి పునాదులు వేశారు. ఐఐఎస్‌సీ బెంగళూరు, టాటా పవర్ కంపెనీలను స్థాపించారు. 1904 మే 19న కన్నుమూశారు.

రస్కిన్ బాండ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' రస్కిన్‌బాండ్ 1934 మే 19న జన్మించారు. బ్రిటీష్ మూలాలు కలిగిన భారతీయ రచయిత. తనను దత్తత పొందిన కుటుంబంతో కలసి ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలోని లౌండర్‌లో నివసిస్తున్నారు. పలు పత్రికలకు కవితలు, కథలు రాశారు. బాలల సాహిత్య అభివృద్ధిలో ఆయన పాత్రను భారత విద్యామండలి గుర్తించింది. 'పద్మశ్రీ', సాహిత్య అకాడమీ పురస్కారం, జీవితసాఫల్య పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు.

నవాజుద్దీన్ సిద్దికి (పుట్టినరోజు)



నవాజుద్దీన్ సిద్దికి 1974 మే 19న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజాఫ్ఫర్ నగర్, బుధానలో జన్మించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి. సినిమా నటుడిగా పేరొందారు. 1999లో అమీర్ ఖాన్ హీరోగా నటించిన 'సర్ఫారోష్' చిత్రం ద్వారా సినీరంగంలోకి ప్రవేశించారు. పాన్‌సింగ్ తోమర్, పేట, హీరోపంతి2 సినిమాలు ఎంతో గుర్తింపు ఇచ్చాయి.


వాసవీమాత ఆలయాలకు పోటెత్తిన భక్తులు



శ్రీరామ సముదాయ మందిరంలో అమ్మవారికి అలంకరణ



హోమంలో పాల్గొన్న భక్తులు



స్వర్ణకర్షక భైరవ అలంకరణలో అమ్మవారు

» వాసవిజయంతిన ప్రత్యేక పూజలు, ఊరేగింపులు

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కన్యకా పరమేశ్వరి ఆలయాలలో భక్తులు పోటెత్తారు. శనివారం వాసవి జయంతిని పురస్కరించుకుని బెంగళూరు నగర వ్యాప్తంగా ఉండే పలు వాసవిమాత ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. తెల్లవారుజామునుంచే అమ్మవారికి అభిషేకం అనంతరం అలంకరణలు చేశారు. సజ్జన్ రావ్ సర్కిల్, చామరాజపేట, మల్లేశ్వరం, జయనగర, గిరినగర్, కేఆర్‌పురం తదితర ప్రాంతాల ఆలయాలలో విశేష పూజలు కొనసాగాయి. జయనగర సిద్దాపురలోని ఆర్యవైశ్య మండలి ఆధ్వర్యంలో 41వ వార్షికోత్సవంలో భాగంగా శుక్ర, శనివారాలలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శుక్రవారం గజేంద్రమోక్ష పూజా కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ కళశ స్థాపన, గంగపూజ చేశారు. అనంతరం కళశాలతో పుర వీధులలో ఊరేగించారు. గణపతి హోమం, నవగ్రహ హోమం, దిక్పాలక హోమం, వాసవి అష్టోత్తర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

విజయపురలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం సమీపంలోని ఆవతి గ్రామంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవిజయంతి వైభవంగా జరిగింది. సంఘం ప్రముఖులు, సభ్యులు పట్టణంలోని దుకాణాలను మూసి ఉత్సవాల్లో భాగస్వామ్యులయ్యారు. ఆలయంలో కళశస్థాపన, గంగపూజ, హోమాదికాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించిన వాహనంలో పురవీధులలో ఊరేగించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఎన్ఆర్ ప్రకాశ్, కార్యదర్శి ఎన్ఆర్ అశ్వత్ తదితరులు పాల్గొన్నారు.

అరికెరెలో వాసవి జయంతి ఉత్సవం

బొమ్మనహళ్ళి: నియోజకవర్గంలోని అరికెరెలో కొలువైన కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి జయంతిని పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు సాగాయి. వాసవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, హోమాలు, కుంకుమార్చన, ఇతర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ ట్రస్టు అధ్యక్షుడు పోతన్నశెట్టి మాట్లాడుతూ ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి దైనందిన పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన అమ్మవారు కొంగుబంగారంగా ఉన్నారన్నారు. మహాశక్తి స్వరూపమైన అమ్మవారి మహాత్మ్యం ఎనలేనిదన్నారు. ఆలయ ట్రస్టు ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు, ఆయా పర్వదినాలకు అనుగుణంగా విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా అమ్మవారి ఆలయంలో వాసవిజయంతిని పురస్కరించుకుని స్థానిక సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ కుటుంబీకులను ఆలయ ప్రముఖులు సత్కరించారు. ఉత్సవంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కేపీ క్రిష్ణయ్య, వీవీఎస్ రావ్, కార్యదర్శి జీ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ గోవిందరాజశెట్టి, ట్రెజరర్ వాసుదేవ్‌గుప్త, జాయింట్ ట్రెజరర్ అంబా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవంలో వందలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



జయనగర సిద్దాపురలో కళశాల ఊరేగింపులో అమ్మవారు



హోమంలో పాల్గొన్న సంఘం సభ్యులు, భక్తులు



ఆవతి గ్రామంలో వాసవి అమ్మవారు



అరికెరెలోని వాసవిదేవి అమ్మవారు



మల్లేశ్వరంలో రాజకుమారి అలంకరణలో..

బూట్లు నాకడం ఆపు... నిన్ను మెగాస్టార్ చేయరు

» హీరోయిన్ రష్మికా మందణ్ణపై

మాజీ మంత్రి అంజలి నింబాల్కర్ ఆగ్రహం

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): బూట్లు నాకడం ఆపాలని ఇలా మాట్లాడితే నిన్ను మెగాస్టార్ చేయరని కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి అంజలి నింబాల్కర్ ప్రముఖ హీరోయిన్ రష్మికా మందణ్ణను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముంబైలోని అటల్ బ్రిడ్జ్‌ను కొనియాడుతూ అభివృద్ధికి ఓటు వేయాలని రష్మికా మందణ్ణ ఇటీవల సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఇందుకు అంజలి నింబాల్కర్ శనివారం తీవ్రంగా స్పందించారు. బూట్లు నాకడం ఆపాలని మండిపడ్డారు. బుల్లెట్ రైలు గురించి ఏమైనా చెప్పడం ఉందా అని ప్రశ్నించారు. ముంబై, అహ్మదాబాద్ బుల్లెట్ రైలు నిర్మాణంలోనే ప్రమాదానికి గురైన అంశాన్ని ప్రస్తావించారు. రష్మికా వీడియోపై కన్నడ నటుడు చేతన్ మండిపడ్డారు. పదేళ్లలో ఆదాయపు అసమానత ఆకాశన్నంటిందని, ప్రజాస్వామ్య స్వాతంత్ర్యం దాడికి గురైందని ఎవరో మూర్ఖపు పార్టీ కాంక్రీట్ వేయవచ్చునని, మౌలిక సదుపాయాలు కల్పించవచ్చునని అయితే సమాజం సుస్థిరత, అభివృద్ధి నైజం అవసరమన్నారు. కాగా రష్మికా మందణ్ణ చేసిన ట్వీట్‌ను ప్రధానమంత్రి రీ ట్వీట్ చేయడం గమనార్హం.



అంజలి నింబాల్కర్

వెంకటేశ్వర ఆలయంలో విశేషపూజలు

శిడ్లఘట్ట, మే 18: పట్టణంలోని వాసవి రోడ్డులో కొలువైన లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో వైశాఖమాసం శుక్లపక్షం శనివారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయశుద్ధి, సుప్రభాత సేవ అనంతరం 6గంటలకు స్వామివారికి అభిషేకం జరిపారు. తదుపరి కల్యాణోత్సవం, ఉయ్యాలోత్సవం, తులసి అలంకరణ నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ధూపదీప నైవేద్యాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకుముందు భక్తుల బృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. మరోవైపు గోవింద నామస్మరణతో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



తులసి అలంకరణలో స్వామివారు

ఆధునిక సంప్రదాయ జీవనశైలి డిజైన్ల మేళా

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక, సంప్రదాయ జీవనశైలికి అనుగుణంగా డిజైన్లమేళాలో నగర ప్రజలు భాగస్వామ్యులు కావాలని ప్రముఖ నటి లక్ష్మీగౌడ పిలుపునిచ్చారు. చిత్రకళా పరిషత్‌లో ఇండియన్ ఆర్టిజన్ బజార్‌ను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల హస్తకళల ఉత్పత్తులు, ఖాదీ వస్త్రాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈనెల 26వరకు మేళా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



మేళాలో నటి లక్ష్మీగౌడ

మహిళలు మెచ్చే పవిత్రం డిజైన్‌లు

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆభరణాలంటే ఎంతో ఇష్టమని భారతీయ సంస్కృతిలో శతాబ్దాలకాలంగా ఉండే డిజైన్‌లు ఆలయాలు వాటికి అనుబంధమైనవని, అందుకు అనుగుణంగానే వినియోగదారులకోసం పవిత్రం పేరిట ఆవిష్కరించామని పీఎం జ్యువెల్స్ ముఖ్యులు నీరవ్‌చల్లా అభిప్రాయపడ్డారు. ఆలయాలలో ఉండే డిజైన్లకు అనుగుణంగా పలు మోడల్స్ తెచ్చామన్నారు. కోణార్క సూర్యదేవాలయం, మల్లికార్జున ఆలయం, మీనాక్షి అమ్మవారు, అనంత పద్మనాభస్వామి, తిరుమల ఆలయాలలో ఉండే డిజైన్లకు అనుగుణంగా రూపొందించామన్నారు. 18శాఖలలోనూ డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

10 లక్షల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనం, అదుపులో నిందితుడు

బంగారపేట, మే 18: గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసిన సీఈఎన్ పోలీసులు రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో డీఎస్పీ ఎస్ పాండురంగ నేతృత్వంలో సీఈఎన్ సైబర్‌క్రైం పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సిబ్బంది కార్యాచరణ నిర్వహించారు. బంగారపేట పట్టణ జూనియర్ కళాశాల వద్ద గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బీహార్ రాష్ట్ర బక్సార్ జిల్లా పురావ గ్రామానికి చెందిన జితేంద్రకుమార్ (30)ను అరెస్టు చేశారు. 5 కేజీల 175 గ్రాముల ఎండిన గంజాయి, 4 కేజీల 730 గ్రాముల భంగ్ చాక్లెట్‌లను టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు జితేంద్రకుమార్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యాచరణలో పాల్గొన్న సిబ్బందిని జిల్లా ఎస్పీ కేఎం కాంతరాజు ప్రశంసించారు.

రికవరీ బంగారం చోరీ - కానిస్టేబుల్ అరెస్టు

బంగారపేట, మే 18: దొంగతనం కేసులో రికవరీ చేసిన 1 కేజీ 408 గ్రాముల బంగారంలో సుమారు అరకిలో బంగారాన్ని చోరీ చేసిన క్రైం విభాగం కానిస్టేబుల్‌ను అరెస్టు చేశారు. కోలారు జిల్లా బంగారపేట స్టేషన్ క్రైం విభాగం కానిస్టేబుల్ అనిల్ అరెస్టు అయిన వ్యక్తి. వివరాలిలా. ఫిబ్రవరి 25న బంగారపేట బస్టాండ్‌లో బంగారు వ్యాపారి గౌతమ్‌చంద్‌కు చెందిన 2 కేజీల బంగారం చోరీకి గురైంది. ఈ కేసులో 1 కిలో 408 గ్రాముల బంగారాన్ని రికవరి చేశారు. అయితే ఇందులో 582 గ్రాముల బంగారం కనిపించలేదు. ఇటీవల 15 రోజుల క్రితం లోక్‌సభ ఎన్నికలు రెండో విడత పోలింగ్ అనంతరం కానిస్టేబుల్ అనిల్ కనిపించలేదు. దీంతో ఘటనపై ఆరా తీయాల్సిందిగా కేజీఎఫ్ డీఎస్పీకి ఎస్పీ శాంతరాజు సూచనతో పోలీసులు దర్యాప్తు చేయగా ఎట్టకేలకు కానిస్టేబుల్‌ను అరెస్టు చేశారు.

ఆర్‌సీబీ జట్టు ఆధ్వర్యంలో నిప్పాన్ కొత్తబ్రాండ్ విడుదల

బెంగళూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయల్ చాలెంజర్స్ ఆఫ్ బెంగళూరు (ఆర్‌సీబీ) క్రికెట్ జట్టు కెమెరాన్ గ్రీన్, రజత్ పాటిదార్, లాకీ ఫెర్గూసన్, మహిపాల్ లోమరర్‌లు సంయుక్తంగా నిప్పాన్ సరికొత్త బ్రాండ్ వెదర్ 8ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కెమెరాన్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు తట్టుకునేలా పెయింట్ ఉండాలని అభిప్రాయపడ్డారు. నిప్పాన్ ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మార్క్‌టైటస్ మాట్లాడుతూ ఎండ, వర్షంలకు ఏమాత్రం వెలుపలి గోడలు మార్పు లేకుండా వెదర్‌బ్యాండ్ 8 పనిచేయనుందన్నారు. జర్మనీకి చెందిన నిప్పాన్ 142 ఏళ్ల అనుభవం కల్గిన సంస్థగా అభిప్రాయపడ్డారు.

దోమల నియంత్రణపై జాగృతి

శిడ్లఘట్ట, మే 18: తొలకరి వర్షాలు కురుస్తుండడంతో దోమలబెడద అధికమవుతోందని ఈ నేపథ్యంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని తాలూకా ఆరోగ్యా అధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి శనివారం జాగృతి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఈడిస్ ఈజిప్ట్ దోమ ద్వారా డెంగీ జ్వరం ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ఇళ్ల చుట్టుపక్కల స్వచ్ఛత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సాధ్యమైనవారు దోమతెరలు వాడాలని సూచించారు. ఆసుపత్రిలో డాక్టర్ మంజునాథ్, స్వాతి, మాధవ్, సుగుణ, తాలూకా అధికారి దేవరాజ్, నందిని తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో జాగృతిలో పాల్గొన్న వైద్యులు తదితరులు

రేపటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ, మే 18: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు ఈ నెల 20వతేదీ నుంచి ప్రారంభమై 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి పెన్నహోబిలానికి తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 21న ధ్వజారోహణం, రాత్రి ప్రాకారోత్సవం, 22న సింహవాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం, 23న గో, శేషవాహనోత్సవాలు జరగనున్నాయి. 24న హంస వాహనోత్సవం, 25హనుమంత వాహనోత్సవం, 26న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 27న సూర్యప్రభ, ఐరావత వాహనోత్సవం, 28న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 29న అశ్వ వాహనోత్సవం, 30న ధ్వజారోహణం, శయనోత్సవం, 31న ఉత్సవ విగ్రహాల పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు తరలి వెళ్లే కార్యక్రమాలు ఉంటాయి. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.